క్లుప్తంగా

అలయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్‌గా శ్రీనివాస్



ప్రమాణ స్వీకారం చేస్తున్న పడాల శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: అలయన్స్ క్లబ్ జిల్లా మల్టిపుల్ కో ఆర్డినేటర్ – 2గా సామాజిక సేవకుడు పడాల శ్రీనివాస్‌ను నియమితులయ్యారు. గుండువారి వీధిలోని లయన్స్ కమ్యూనిటీ హాలు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ సాధన, జేమ్స్ క్లబ్స్‌కు 2025 – 26 సంవత్సరం అధ్యక్షుల ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం జరిగింది. సాధన క్లబ్ అధ్యక్షురాలిగా భయ్యా భారతి, అలయన్స్ క్లబ్ కార్యదర్శిగా శారద, కోశాధికారిగా తుల్లి పద్మావతి, జేమ్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ శివ, సెక్రటరీగా చిట్టిబాబు, ట్రెజరర్‌గా ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. పూర్వపు జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు, పూర్వపు జిల్లా గవర్నర్ బుచ్చిరామ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

అధ్యాపకురాలు రాజేశ్వరికి సర్వేపల్లి పురస్కారం



సీటీఆర్ఐ: సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంస్కృత అధ్యాపకురాలు రాజనాల రాజేశ్వరి ఎంపికయ్యారు. గుంటూరుకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్, కేవీఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆమెకు పురస్కారాన్ని అందజేయనున్నారు. సాహిత్యం, విద్య, సామాజిక రంగాల్లో రాజేశ్వరి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

రాజమహేంద్రవరం సిటీ: దేశంలోని ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోర్ గద్దె చోడ్ నిరసన కార్యక్రమంలో భాగంగా ఏఐస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టి నవతారకేష్ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ చౌక్, జాంపేట ప్రాంతాల్లో ప్రజలకు పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌యూఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి రాజీవ్ గాంధీ, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి మనీష్ తివారీ, పీసీసీ సభ్యుడు బోడ వెంకట్, కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ పాల్గొన్నారు.

పర్యావరణానికి వరం ప్రకృతి వ్యవసాయం

అనపర్తి : రైతులు రసాయనాలపై ఆధారపడకుండా, పర్యావరణానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం అనపర్తి మండలం ఏ.సావరంలో ఆయన వ్యవసాయ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకృతి పద్ధతుల్లో సాగు చేస్తున్న పొలాలను పరిశీలించి, రైతులతో ముచ్చటించారు. మరింత మంది రైతులను ఈ పద్ధతికి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ప్రకృతి పద్ధతుల్లో సాగు వల్ల రైతుల ఉత్పత్తి ఖర్చులను తగ్గుతాయని, ఆదాయం పెరుగుతుందని, వినియోగదారులకు సురక్షితమైన రసాయన రహిత ఆహారం అందించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కృష్ణ, డెల్టా జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: సుందరకాండ
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలెస్	: సుందరకాండ
స్వామి	: కూలీ
అనుశ్రీ	: కూలీ
శివజ్యోతి	: బకాసుర రెస్టారెంట్
రాజా	: సుందరకాండ
ఊర్వశి	: కూలీ
మేనక	: సుభ్రంసో
రంభ	: మహావతార్ నరసింహ
అప్సర	: వార్–2
అశోక	: వార్–2
నామవరం:	
వీఎస్.మహల్	: కూలీ
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ	: కూలీ, మహావతార్ నరసింహ
కడియం:	
వెంకటసూర్య	: కూలీ

పూజకు వేళాయె..

- వినాయక చవితికి సర్వం సిద్ధం
- మట్టి ప్రతిమలకు ఆదరణ
- పూలు, పండ్లు, పూజా సామగ్రికి డిమాండ్
- దడ పుట్టిస్తున్న ధరలు
- కిక్కిరిసిన మార్కెట్లు

సీటీఆర్ఐ: వినాయక చవితి సందర్భంగా అంతటా సందడి నెలకొంది. పల్లె నుంచి నగరం వరకూ వాడవాడలా బొజ్జ గణపయ్య కొలువుదీరనున్నాడు. గణపతికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించడానికి భక్తులు సిద్ధమయ్యారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మంటపాల్లో ప్రతిష్ఠించడానికి విగ్రహాలను తరలించారు. ఇక మార్కెట్‌లో మట్టి ప్రతిమలు, పూజా సామగ్రిని భక్తులు కొనుగోలు చేస్తున్నారు. వివిధ రకాల పత్రి, పూలు, పూజా సామగ్రి దుకాణాలతో రోడ్లన్నీ రద్దీగా మారాయి.

సందడే సందడి

వినాయక చవితి పూజకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. తోపుడుబళ్ల నుంచి పెద్ద దుకాణాల వరకూ కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. అక్కడి పత్రి, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, వినాయక ప్రతిమలను కొనుగోలు చేశారు. కంబాల చెరువు, జాంపేట, గాంధీబొమ్మ, గోదావరి గట్టు తదితర ప్రాంతాలలో పూజకు కావాల్సిన పత్రిని విక్రయించారు. అయితే పండగ సందర్భంగా పూజా సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పత్రి, పాళి, పూలు, పండ్లు, ఇతర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పర్యావరణానికి హితమైన మట్టితో చేసిన వినాయకుడి విగ్రహాలను పూజలో వాడాలని ప్రజల్లో అవగాహన వచ్చింది. నగరంలో చాలా చోట్ల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రజల్లో కూడా చైతన్యం రావడంతో మట్టి వినాయకుని ప్రతిమలను ఎక్కువగా కొనుగోలు చేశారు.

ఆలయాల ముస్తాబు

- రాజమహేంద్రవరంలోని ప్రధాన వినాయక ఆలయాలతో పాటు వీధుల్లో ఏర్పాటు చేసిన పందిళ్లతో చవితి సందడి పెరిగింది. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.
- శృంగేరి జగద్గురు మహాసంస్థానం, శారదా పీఠం, శంకమఠంలోని రత్నగర్భ గణపతి నవరాత్ర దీక్షా మహోత్సవాలు ప్రారంభయ్యాయి.
- వంకాయల వారి వీధిలో వెలిసిన అష్ట సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. కాటన్ దొర గోదావరిపై బ్రిడ్జి నిర్మించేటప్పుడు అనేక అటంకాలు ఏర్పడ్డాయి. అప్పుడు కొందరి సూచన మేరకు ఈ ఆలయంలోని వినాయకుడిని దర్శించుకున్నారు. తర్వాత బ్రిడ్జి పనులు వేగవంతం అయ్యాయి. దీనితో కాటన్ దొర ఈ ఆలయానికి పెద్ద గంటను బహూకరించారు.
- పుష్కరఘాట్‌లో అత్యంత వైభవంగా వినాయక వేడుకలను నిర్వహిస్తారు. ఇవే కాక ప్రధానాలయాలు, ఉపాలయాలు, వీధిల్లో వేసిన చవితి పందిర్లలో వినాయక పూజకు సర్వం సిద్ధం చేశారు.



కంబాలచెరువు సెంటర్‌లో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు



మట్టి గణపతి ప్రతిమలు



కలువ పువ్వులు కొనుగోలు చేస్తున్న యువతి



పుష్కరాలరేవు వద్ద రాజమహేంద్రి గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తున్న వినాయక పందిరి



ఆర్యాపురం సత్యనారాయణ స్వామి గుడి వద్ద ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి

- అన్నదానాలకు అనుమతి అవసరం
- కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నోడల్ అధికారులు ప్రతి రోజూ తమకు కేటాయించిన వార్డుల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేయాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వినాయక చవితి పందిళ్ల అనుమతులు, వార్డు సచివాలయాల పనితీరు, డ్రెయిన్ మేనేజ్ మెంట్, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, రెవెన్యూ కలెక్షన్, సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధంతో సహా పలు అంశాలపై నోడల్ ఆఫీసర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల ఉద్యోగులతో వారానికోసారి తప్పనిసరిగా సమీక్ష నిర్వహించాలని, క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో డీటెయిల్డ్ నోట్ కచ్చితంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పైపులైన్ల లీకేజీలపై ఫిర్యాదులు ఎక్కువగా అందుతున్నాయని, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వర్మీ కంపోస్ట్, తడి, పొడి చెత్తను వేరు చేయడం కూడా సరిగ్గా జరగడం లేదన్నారు. అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించడంలో తాత్సారం ఎందుకు జరుగుతోందని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ప్రశ్నించారు. వినాయక చవితి పందిళ్లకు సంబంధించి ఇప్పటి వరకు ఇచ్చిన అనుమతులను పరిశీలించి, సచివాలయాల వారీగా రిపోర్టు అందజేయాలన్నారు. ప్రసాదాల పంపిణీకి ఎక్కడా ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగించకూడదన్నారు. అన్నదానాలకు అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. నోడల్ అధికారులందరికీ వైర్‌లెస్ సెట్లు అందజేయాలని, దీని ద్వారా కమ్యూనికేషన్ సులభతరం అవుతుందన్నారు. సమీక్షలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్‌ఓ వినూత్న, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఈఈలు మాధవి, రీటా, మదర్సా అలీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

శెట్టిబలిజను గౌడ కులంగా మార్చవద్దు

సీటీఆర్ఐ: శెట్టిబలిజ కులాన్ని గౌడగా మార్చుతూ జారీ చేసిన 16వ నంబర్ జీవోను రద్దు చేయాలని శెట్టి బలిజ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి శెట్టిబలిజలకు గౌడ కులం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్లో మంగళవారం శెట్టిబలిజ సంఘం రాజమండ్రి అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ విభజన ఆంధ్రప్రదేశ్ జనాభాలో అత్యధిక సంఖ్యలో 40 లక్షలకు పైగా ఉన్న శెట్టిబలిజలను అలాగే కొనసాగించాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే అమలాపురం, పాలకొల్లు, నరసాపురాల్లో శెట్టిబలిజలు నిరసనలు తెలుపుతున్నారని, తాము కూడా రాజమహేంద్రవరంలో ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి బొక్కా సత్య వెంకట ప్రతాప్, సభ్యులు బత్తిన ఏడుకొండలు, పోలవరపు రాము పాల్గొన్నారు.



సమావేశంలో ఐక్యతను చాటుతున్న శెట్టిబలిజ నాయకులు

ఘనంగా మదర్ థెరిసా జయంతి



ధవళేశ్వరంలో పేదలకు భోజనం అందజేస్తున్న స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

కడియం: పొట్టిలంక గ్రామంలోని లూథరన్ చర్చి ఆవరణలో మదర్ థెరిసా సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం, డి.నవీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి అర్థాల కుమార్ బాబు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు నక్క చంటిబాబు, కొల్లపు వీరన్న, కొండేపూడి చిన్ని, నక్క ఆనంద కుమార్ పాల్గొన్నారు.



పొట్టిలంకలో మదర్ థెరిసా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సంఘ సభ్యులు

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోసి కుమార్ మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా అన్నారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులు, నిరాశ్రయులకు భోజనాలు, పండ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా లడ్డూల విక్రయం

రాజమహేంద్రవరం రూరల్: గణనాథుని విగ్రహాల చేతిలో పెట్టేందుకు అవసరమైన లడ్డూల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వీటు షాపుల్లో ఆర్డరు ఇచ్చి వీటిని తయారు చేయించుకుంటున్నారు. ఒక కేజీ నుంచి వంద కేజీల వరకూ లడ్డూలను తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన లడ్డూలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.



ప్రత్యేకంగా తయారు చేసిన 90 కిలోల లడ్డూ

నేటి నుంచి సదనం కళాశాలలో కార్యక్రమాలు

సీటీఆర్ఐ: గోదావరి గట్టున ఉన్న ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, సదనం విద్యా సంస్థలలో 54వ సరస్వతీ సపర్యా మహోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి సెప్టెంబర్ 4 వరకూ వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని కళాశాల పాలక వర్గం మంగళవారం ప్రకటనలో తెలిపింది. బుధవారం గణపతి వైభవం, రమణీయ స్మృతి అవార్డు ప్రదానం, గురువారం చమత్కార శ్లోకాలు, 29న వీణ, మృదంగం, 30న పార్వతీ కల్యాణం హరికథ, 31న రామాయణ కల్పవృక్షంలో ముప్పురు తల్లులు, సెప్టెంబర్ 1న ప్రబంధ కవులు సరస్వతీ సపర్య, 2న కిరాతార్జునీయం, 3న రామాయణం కుటుంబ విలువలు, 4న మైరావణ చరిత్ర తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



నల్లమిల్లి వెంకటరెడ్డికి మట్టి వినాయక ప్రతిమను అందిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సీటీఆర్ఐ: వినాయక చవితిని పురస్కరించుకుని జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర్ నగర్‌లో గణపతి మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మేడపాటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వుండవల్లి సత్యనారాయణ, భానుప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమిల్లి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యుడు, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక వినాయక ప్రతిమను నల్లమిల్లి వెంకటరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గూడూరి కమల్ పాల్గొన్నారు. శ్రీ ప్రకాష్ స్కూల్ విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.
- పర్యావరణహితంగా మట్టి విగ్రహాలతో చవితి పండగ జరుపుకోవాలని గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ జాతీయ అధ్యక్షుడు వరదా నాగేశ్వరరావు తెలిపారు. కంబాల చెరువు టాక్సీ స్టాండ్ వద్ద గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రతిమలు అందజేశారు.



జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..



సత్యసాయి గురుకులంలో..

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యాం సుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య అన్నారు. గురుకులంలో మంగళవారం సాయంత్రం మట్టి గణపతి ప్రతిమలను వితరణ చేశారు. సుమారు 1,350 మందికి వీటిని అందజేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి నిమజ్జనాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాల ఏర్పాట్లపై మంగళవారం నగరపాలక సంస్థలో అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్ సెట్లు, డీజేలు పూర్తిగా నిషేధమన్నారు. ఈఈ (ఇంజినీరింగ్) అలీ మాట్లాడుతూ ఇసుక ర్యాంపు వద్ద నిమజ్జనాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని, ప్రస్తుతం ఉన్న లైన్లతో పాటు అదనంగా మరో ఐదు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తునట్లు వెల్లడించారు.

పద్యంతో తెలుగుభాషపై పట్టు

సీటీఆర్ఐ: పద్యాలను స్పష్టంగా పలకడం వల్ల తెలుగుభాషపై పట్టు కలుగుతుందని నాటక కళాకారుడు సుబ్రహ్మణ్య మాస్టరు అన్నారు. తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి ఆధ్వర్యంలో తెలుగు మాటల పండగ ఆరో రోజు పద్య నిధి కార్యక్రమాన్ని మంగళవారం సంహిత కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. మరో కళాకారుడు డీఎస్పీ రావు మాట్లాడుతూ వేమన, సుమతి, భాస్కర, దాశరథి శతకాల్లోని నీతి.. దారి దీపమై కాపాడుతుందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ అక్షరం ముక్క రాని సామాన్యులు కూడా వందల పద్యాలు పడుతున్నారంటే అది పద్య సాహిత్యం గొప్పతనం అన్నారు. సంహిత కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, సైకాలజిస్ట్ ద్వారపు నాగిరెడ్డి, దేశిరెడ్డి బలరామనాయుడు, సీతారామ నాయుడు, జయరాజ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాటక కళాకారులు, విద్యార్థినులు

విద్యార్థిని హింసించడం దారుణం

కంబాలచెరువు: చైతన్య హాస్టల్లో విద్యార్థిని ర్యాగింగ్ పేరుతో హింసించిన వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన గుర్రం విన్సెంట్ ప్రసాద్‌ను సహచర విద్యార్థులు పైశాచికంగా హింసించడం చాలా దారుణమన్నారు. వారిపై యాజమాన్యం, అక్కడ మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్ చర్యలు తీసుకోలేదన్నారు.

